క్లుప్తంగా

నేడు 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ' సమావేశం

రాజానగరం: మండలంలోని దివాన్‌చెరువులో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నామని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా తెలిపారు. పండ్ల మార్కెట్‌కు ఎదురుగా ఉన్న డీవీబీ రాజు కల్యాణ మండపంలో జరిగే ఈ సమావేశానికి నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు తరలి రావాలన్నారు.

10న పాఠశాలల్లో సమావేశం

పెదపూడి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 10న మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి అన్నారు. పెదపూడిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ జరుగుతుందన్నారు. నిబంధనల ప్రకారం సమావేశం నిర్వహణకు ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

రైతులకు రాయితీపై డ్రోన్లు

రంగంపేట: రైతులకు రాయితీపై డ్రోన్లు అందిస్తున్నట్టు మండల వ్యవసాయ అధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు వడిశలేరుకు చెందిన అలేఖ్య రైతుమిత్ర సంఘం గ్రూపు సభ్యులకు ఆర్‌కేవీవై 2025 అగ్రి కిసాన్ డ్రోన్ పథకం కింద 80 శాతం రాయితీపై మంజూరైన డ్రోన్‌ను సోమవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అందించారన్నారు. సిరు సంచుల ప్రయోగంలో భాగంగా ప్రభుత్వం అందించిన మినుము విత్తనాలను రైతులకు పంపిణీ చేసినట్టు తెలిపారు.

వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వెంకటలక్ష్మి

బిక్కవోలు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కొంకుదురు పీహెచ్‌సీ వైద్యురాలు జి.విజయలక్ష్మి అన్నారు. ఆమె సోమవారం సిబ్బందితో కలసి కాపవరంలో వైద్య శిబిరం నిర్వహించారు. అలాగే ఆ గ్రామంలోని రెండు రోజులుగా మూడు బృందాలు చేస్తున్న సర్వేను పరిశీలించారు. 220 గృహాలు, 632 మందిని కలిసి పరిశీలించగా, వారిలో ఇద్దరు జ్వరంతో బాధపడుతున్నరన్నారు.అలాగే 56 మందికి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు.

వివిధ సమస్యలపై ఎనిమిది అర్జీలు

సీతానగరం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఎనిమిది అర్జీలు వచ్చాయి. ఎంపీడీవో ఎం.భారతి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ వాటిని అందుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కేవీఎస్ఎస్ మూర్తి, ఏవో సుబ్రహ్మణ్యం, సీనియర్ అసిస్టెంట్ గోపాల్, టైపిస్ట్ సతీష్ పాల్గొన్నారు.

290 మందికి వైద్య సేవలు

సీతానగరం: స్థానిక కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో శ్రీరామకృష్ణ మఠం, వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరాల్లో 290 మందికి డాక్టర్లు రాయుడు శ్రీనివాస్, సత్యం రమేష్‌బాబు వైద్యసేవలు అందించారు. రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో 207 మందికి వైద్య పరీక్షలు జరిపారు. కంటి శిబిరంలో 83 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 18 మందికి క్యాటరాక్టు ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారిని ఆపరేషన్ల కోసం ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, వై.వెంకట నారాయణ, కె.శ్రీనివాస్, చంటిబాబు, పురుషోత్తం పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కోరుకొండ: రాజానగరం నియోజకవర్గంలో రూ.13.54 కోట్లతో చేపట్టే రోడ్డు నిర్మాణాలకు సోమవారం ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి శంకుస్థాపన చేశారు. మునగాల, నిడిగట్ల, గాదరాడ గ్రామాల్లో సీసీ రోడ్లు ప్రారంభించారు. అలాగే కోరుకొండలో బీజేపీ కార్యాలయాన్ని ఎంపీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, టీడీపీ నేత పెందుర్తి అభిరామ్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్న చౌదరి తదితరులు పాల్గొన్నారు.

జగద్గురువుగా శ్రీకృష్ణుడినే పూజించాలి

రాజానగరం: ప్రపంచానికి భగవద్గీతను అందించిన శ్రీకృష్ణుడే జగద్గురువని, గురు పూర్ణిమకు ఆయనను మాత్రమే పూజించాలని రాజమహేంద్రవరానికి చెందిన త్రైత సిద్ధాంత ప్రబోధ ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు పేర్కొన్నారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతతో పాటు అనుబంధ గ్రంథాలపై మండలంలోని భూపాలపట్నం, శ్రీకృష్ణపట్నంలలో సోమవారం ప్రచారం నిర్వహించారు.

మొక్కుబడిగా సాగుతూ..

- తూతూమంత్రంగా 'పొలం పిలుస్తోంది'
- వ్యవసాయ అధికారులు మాత్రమే హాజరు
- అనుబంధ శాఖల అధికారుల డుమ్మా
- రైతులకు చేరని సాగు పాఠాలు



రంగంపేటలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి హాజరైన ఏఓ, మిగిలిన అధికారులు రాలేదు



కోటపాడులో జరిగిన కార్యక్రమంలో ఏఓ తప్ప, కనిపించని మిగిలిన అధికారులు

రంగంపేట: రైతులు పంటల సాగులో పాటించాల్సిన మెలకువలు, సస్యరక్షణ, అధిక దిగుబడి సాధించేందుకు సలహాలు, సూచనలు ఇవ్వడానికి నిర్వహించే పొలం పిలుస్తోంది సదస్సులు మొక్కుబడిగా సాగుతున్నాయి. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు ఈ కార్యక్రమానికి అసలు హాజరు కావడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అప్పుడప్పుడు కొన్ని శాఖల అధికారులు హాజరైనా.. ఇలా వచ్చి, అలా ఫొటో దిగి వెళుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

రైతులకు ఉన్న సందేహాలను తీర్చి నాణ్యమైన మంచి దిగుబడులు సాధించేలా చైతన్య పర్చడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. రైతులకు సలహాలు ఇచ్చేందుకు రోజుకు రెండు గ్రామాల చొప్పున ప్రతి వారం నాలుగు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరగాలి. ఈ నేపథ్యంలో వారంలో మంగళ, బుధవారాల్లో ఈ కార్యక్రమం నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు.

అనేక విమర్శలు

రంగంపేట మండలంలోని అన్ని గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించేందుకు మండల వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయికి వెళుతున్నారు. వారందరూ ఆహార, వాణిజ్య, పండ్లు, పూల తోటలు, పట్టు తదితర సాగుకు సంబంధించిన రైతులకు అవగాహన కల్పించాలి. కానీ రంగంపేట మండలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమానికి వ్యవసాయ అధికారులు వస్తున్నా, అనుబంధ శాఖల వారు పూర్తి స్థాయిలో హాజరు కావడం లేదు. వ్యవసాయ శాఖతో పాటు ఆత్మ, సెరికల్చర్, ఉద్యానశాఖ, పశుసంవర్ధకశాఖ, డెయిరీ డెవలప్‌మెంట్, కో ఆపరేటివ్ ఫెడరేషన్, మార్కెటింగ్ శాఖ, ఇరిగేషన్, విద్యుత్, ప్రకృతి వ్యవసాయం తదితర సుమారు పది శాఖల అధికారులు విధిగా హాజరుకావాలి. వాస్తవానికి ఒకటి, రెండు శాఖల అధికారులు మాత్రమే మొక్కుబడిగా వస్తున్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది మాత్రం రైతుసేవా కేంద్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నా రైతుల నుంచి స్పందన లేదు. దీంతో మొక్కుబడిగా కార్యక్రమాన్ని నిర్వహించి ఫొటోలు దిగుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పొలాలకు వెళ్లి.. ఫొటోలు దిగి..

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు సాగు వ్యయం తగ్గింపు చర్యలపై అధికారులు అవగాహన కల్పించాలి. నూతన సాగు పద్ధతులు, మేలు రకాల వంగడాలు, ఉత్తమ సాగు ఫలితాలపై చైతన్య పరచాలి. వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి సమావేశాలు ఏర్పాటు చేసి రైతుల అనుమానాలను తీర్చాలి. అయితే వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు డుమ్మా కొడుతున్నారు. దీంతో పండ్లు, పూల తోటల రైతులకు సూచనలు, సలహాలు ఏమాత్రం అందడం లేదు. ఖరీఫ్‌లో రెగ్యులర్ పంటలతో పాటు మిరప, మామిడి, జామ, బొప్పాయి, మొక్కజొన్న, కొబ్బరి, నిమ్మ వంటి పంటలు సాగులో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో రైతులకు సలహాలు, సూచనలు అందడం లేదు. వ్యవసాయ అధికారులు మాత్రం ఎంపిక చేసిన పొలాల్లోకి వెళ్లి ఫొటోలు దిగి వస్తున్నారనే ప్రచారం సాగుతోంది.

అందుబాటులో ఉండాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమాలకు అధికారులు సక్రమంగా హాజరుకావడం లేదు. ఆయా శాఖల అధికారులు వీటిలో పాల్గొని ప్రభుత్వ పథకాలు, పంటల సంరక్షణ, పద్ధతులను రైతులకు తెలియజేస్తే బాగుంటుంది. ప్రత్యేక కార్యక్రమాలకు సైతం అధికారులు హాజరు కాకపోవడం సరికాదు. ఇప్పటికైనా పొలం పిలుస్తోంది కార్యక్రమాలకు వ్యవసాయ అనుబంధ శాఖల అధికారుల హాజరై రైతులకు నిత్యం అందుబాటులో ఉండాలి.

– పుట్టా సోమన్న చౌదరి, అభ్యుదయ రైతు, మర్రిపూడి

అన్ని శాఖలకూ సమాచారం ఇచ్చాం



ప్రతి వారం నాలుగు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నాం. దీనికి సంబంధించి అన్ని శాఖల అధికారులకు షెడ్యూల్ పంపించాం. వివిధ కారణాలతో మిగతా శాఖల అధికారులు హాజరుకావడం లేదు.

దొడ్డిగుంటలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు, చంద్రేడు గ్రామంలో కార్యక్రమానికి అనపర్తి ఏడీఏ కృష్ణ హాజరయ్యారు. ఇతర శాఖల అధికారులు హాజరుకాలేదు.

– కె. శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి, రంగంపేట మండలం

నేడు వైఎస్సార్ జయంతి

కోరుకొండ: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు తెలిపారు. వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. కోరుకొండ, కాపవరం, బూరుగుపూడి, దోసకాయలపల్లి గ్రామాల్లో వేడుకలు నిర్వహిస్తామన్నారు.

అక్రమంగా నిల్వ చేసిన పెట్రోలు, డీజిల్ స్వాధీనం

అనపర్తి: మండలంలోని కుతుకులూరులో అక్రమంగా నిల్వ ఉంచిన పెట్రోలు, డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై ఎల్.శ్రీను నాయక్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ యానాం నుంచి తీసుకువచ్చిన ఈ పెట్రోలు, డీజిల్‌లను కుతుకులూరులో రెండు చోట్ల, పెడపర్తిలోను అక్రమంగా ఉంచి విక్రయాలు సాగిస్తున్నారు. విశ్వసనీయమైన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్టు తెలిపారు. సివిల్ సప్లయిస్ అధికారులకు సమాచారం అందించామని వారి సూచనల మేరకు కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

'సత్యసాయి' కార్మికుల సమ్మె

సీతానగరం: పురుషోత్తపట్నంలోని సత్యసాయి డ్రింకింగ్ వాటర్ సప్లయి ప్రాజెక్టు కార్మికులు సమ్మె బాట పట్టారు. తమకు రావాల్సిన 19 నెలల జీతాలు అందించాలంటూ సోమవారం రాజమహేంద్రవరంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అధికారులు స్పందించకపోవడంతో 52 మంది కార్మికులు అర్ధరాత్రి నుంచి సమ్మెబాట పట్టారు. దీనితో నాలుగు మండలాల్లోని గ్రామాలకు తాగునీటి సమస్య ఏర్పడనుంది.


మొక్కలతో వాతావరణ సమతుల్యత



జి.మామిడాడ పంచాయతీ వద్ద మొక్క నాటుతున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

పెదపూడి: వాతావరణంలో సమతుల్యత సాధించడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జి.మామిడాడ లయన్స్ క్లబ్ శ్రీ సూర్య అడ్మిన్ మండ రాజారెడ్డి అన్నారు. క్లబ్ అధ్యక్షుడు సబ్బెళ్ల శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన సోమవారం జి.మామిడాడలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. రాజారెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అందరూ బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని పరిరక్షించాలన్నారు. అలాగే ఈ ఏడాది లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు, విద్యాభివృద్ధికి విద్యాసామగ్రి పంపిణీ, సామాజిక బాధ్యతతో సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక ప్రణాళికలు తయారు చేశారమన్నారు. గ్రామంలోని మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా, ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయం తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి యువరాజారెడ్డి, క్లబ్ ప్రతినిధులు ద్వారంపూడి వెంకటరెడ్డి, పేకేటి సూర్యప్రకాశ్‌రావు, సబ్బెళ్ల మోహన్‌రెడ్డి, ఆర్.నాగు, ప్రకాశ్‌రావు, సతీష్ రాయుడ, ఫ్యామిలీ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు ద్వారంపూడి భాస్కరరెడ్డి, రాయుడు రాఘవ తదితరులు పాల్గొన్నారు.

వినాయకుని రాతి విగ్రహం చోరీ



మాయమైన గణపతి విగ్రహం (సర్కిల్‌లో..)

సీతానగరం: బొబ్బిల్లంకకు చెందిన వేముల ఆంజనేయులు ఇంటి ఎదురుగా ఉన్న ఆంజనేయస్వామి మందిరంలోని వినాయకుని రాతి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేశారు. ఈ మేరకు సోమవారం మందిరం వ్యవస్థాపకుడు ఆంజనేయులు విలేకరులతో మాట్లాడారు. రాజమహేంద్రవరం – సీతానగరం నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ పనుల్లో ఆంజనేయస్వామి ఆలయాన్ని తొలగించడంతో స్థానికుల సహకారంతో ఇంటి ఎదురుగా తన స్థలంలో ఆంజనేయస్వామి విగ్రహంతో పాటుగా, వాస్తురీత్యా పూర్వ రాతి వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించామన్నారు. వాటిని నిత్యం దూప దీప నైవేద్యాలతో పూజలు నిర్వహిస్తామన్నారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వినాయకుడి విగ్రహాన్ని దొంగిలించారన్నారు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

వినూత్నంగా పీటీఎం ఆహ్వాన పత్రాలు



తయారు చేసిన ఆహ్వాన పత్రికలతో విద్యార్థులు

సీతానగరం: మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం (పీటీఎం) కోసం బొబ్బిల్లంకలోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఆహ్వాన పత్రాలను తయారు చేశారు. ఆ పాఠశాలలో ఈ నెల 10న సమావేశం జరగనుంది. దీని కోసం విద్యార్థులు స్వయంగా ఆహ్వాన పత్రాలు తయారు చేశారు. కార్డులపై వివిధ రకాల చిత్రాలు గీసి వాటికి చక్కగా రంగులు వేశారు. అనంతరం వాటిని ఉద్యోగులకు, పెద్దలకు అందజేశారు. హెచ్‌ఎం కోలా సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలను, ప్రముఖుల గృహాలను సందర్శించి వారిని ఈ సమావేశానికి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రేష్మ, మాచారమ్మ, బి.సత్యనారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



బలభద్రపురంలో దండోరా జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

బిక్కవోలు: బలభద్రపురంలోని ఎస్సీ పేటలో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాదిగ దండోరా జెండాను ఆవిష్కరించారు. సర్పంచి బుంగా రామారావు మాట్లాడారు. అనంతరం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు నల్లమిల్లి వెంకట సుబ్బారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు చిన్నం వీర్రాఘవరెడ్డి, బీసీ నాయకులు సలుమూరి అయ్యప్ప, డోకుబుర్ర యోసేబు. చాపల సతీష్ కుమార్ పాల్గొన్నారు.

పంచాయతీ చెరువుల ఆదాయానికి గండి

రంగంపేట: జి.దొంతమూరు గ్రామంలోని పంచాయతీ చెరువుల ఆదాయానికి కొందరు వ్యక్తులు గండి కొడుతున్నారని ఆరోపిస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు గ్రామ సర్పంచ్ గోలి రమణ తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ జి.దొంతమూరులో పంచాయతీకి చెందిన సోడసాని చెరువు, దుప్పలపూడి చెరువు, కనుగుంట, రెడ్డి చెరువు, కోనేరు, సుక్కిరెడ్డి చెరువు తదితర చేపలు చెరువులు ఉన్నాయన్నారు. వీటిలో చేపలు పెంపకానికి వేలం పాట నిర్వహించి, తద్వారా వచ్చిన సొమ్మును పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధికి ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. అయితే ఇటీవల గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు, ఇతర వ్యక్తులతో కలసి గ్రామ సర్పంచ్‌కు, ఎంపీడీఓకు, ఎఫ్‌టీఓకు తెలియకుండా సొంతంగా వేలం పాటలు నిర్వహించి పంచాయితీ ఆదాయానికి గండి కొడుతున్నారన్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకుని పంచాయతీ ఆదాయం కాపాడాలని కోరుతూ సోమవారం రాజమహేంద్రవరంలోని కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు.

మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం

కోరుకొండ: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలను సోమవారం మండలంలో నిర్వహించారు. బూరుగుపూడిలో ఏడిద పండు ఆధ్వర్యంలో మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వివిధ వాయిద్యాలు, కళాప్రదర్శనలతో ఊరేగింపు జరిపారు.

సహకార సంఘ సిబ్బందికి శిక్షణ ప్రారంభం

రాజానగరం: మండలంలోని కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ఆధ్వర్యంలో కాకినాడ జిల్లాలోని వ్యవసాయ సహకార ప్రాథమిక సంఘాల ప్రతినిధులకు సర్టిఫికెట్ కోర్సులో భాగంగా ఇచ్చే శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. 'పంటలలో సమగ్ర పోషకాల యాజమాన్యం' అనే అంశంపై రాజమహేంద్రవరంలోని జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధన సంస్థలో 15 రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందని ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ తెలిపారు. సమగ్ర పోషకాల యాజమన్యంలోని రసాయన, జీవ, సేంద్రియ ఎరువులు, వివిధ పంటలలో పాటించాల్సిన ఎరువుల షెడ్యూలు, రసాయన ఎరువులను అధిక మోతాదులో వాడటం వలన వచ్చే నష్టాలు మున్నగు వాటిపై అవగాహన కలిగిస్తారన్నారు. జిల్లా వ్యవసాయాధికారి కె.మాధవరావు మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకుని, సహకార సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కేవీకే ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు మాట్లాడుతూ 80 శాతం పైబడి హాజరు ఉన్నవారికే ఈ కోర్సులో సర్టిఫికెట్ లభిస్తుందన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌తో ఉజ్వల భవిష్యత్తు



విజేతకు బహుమతి అందజేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వెయిట్ లిఫ్టింగ్‌తో యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు, అమలాపురం పార్లమెంటు పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. స్థానిక గేదెల నూకరాజు కల్యాణ మండపంలో శ్రీరామ్ పవర్ జిమ్ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ 2025–26 పోటీలను ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులు రెడ్డి ప్రారంభించారు. మెన్, ఉమెన్ కేటగిరిలలో యూత్, జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించారు. ఆదివారం రాత్రి విజేతలకు జక్కంపూడి విజయలక్ష్మి, టీడీపీ వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్, కేశవభట్ల చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు కేశవభట్ల శ్రీనివాస్, ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ సమాఖ్య వైస్ ప్రెసిడెంట్ బడేటి వెంకట రామయ్య, ఇంటర్నేషనల్ కోచ్ అమరనాథ్, దీన్నాబాబు, జిల్లా అధ్యక్షుడు యాళ్ల భాస్కరరావు, అసోసియేషన్ నేతలు సతీష్ కుమార్, రామకృష్ణ, టీవీవీ రామారావు చేతుల మీదుగా బహుమతులు, పతకాలు అందించారు.

రూ.7 వేల కోట్ల టర్నోవర్‌తో మెరుగైన సేవలు



శిక్షణ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ రామస్వామి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) రూ.7 వేల కోట్ల టర్నోవర్‌తో, రూ.15 వేల కోట్ల డిపాజిట్లతో ఉమ్మడి జిల్లాలో మెరుగైన సేవలు అందిస్తోందని ఆ బ్యాంకు చైర్మన్ తుమ్మల రామస్వామి అన్నారు. స్థానిక రామదాసు సహకార శిక్షణ కేంద్రంలో డీసీఎం అండ్ సీఏ పదో బ్యాచ్ శిక్షణను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం 9వ బ్యాచ్‌లో శిక్షణ పూర్తి చేసి, ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి ఎం.వెంకట రమణ, డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ ఆడిట్ ఆఫీసర్ ఎం.జగన్నాథ రెడ్డి, డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసర్ ఎం.కనకదుర్గారెడ్డి, కోర్స్ కో ఆర్డినేటర్ ఆదిమూలం వెంకటేశ్వరరావు, శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు టీకాలు

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి ఒక్కరూ తమ పెంపుడు జంతువులకు యాంటీ రేబిస్ టీకాలు వేయించాలని కడియం ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకులు ఏ.రవివర్మ సూచించారు. జునోసిస్‌డే సందర్భంగా సోమవారం హుకుంపేట రామకృష్ణ నగర్ సచివాలయం వద్ద పశుసంవర్ధక శాఖ, సత్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పెంపుడు జంతువులకు యాంటీ రేబిస్ టీకాలు వేశారు. ముందుగా కార్యక్రమాన్ని ఏడీ రవివర్మ, పశుసంవర్ధకశాఖ సంక్షేమ సభ్యులు, సత్య చారిటబుల్ ట్రస్టు చైర్మన్ తమ్మా రవి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ పి.వెంకటరావు, పశువైద్యులు ఏవీ ప్రసన్న కుమార్, జె. శ్రీరామ్ రవికిరణ్, ఏఎంసీ డైరెక్టర్ ఎం.హిమబిందు తదితరులు పాల్గొన్నారు.